


నివాసాల చోటే ఇళ్ల పట్టాలివ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షంలో ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న వారికి అక్కడే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కేశాపు అక్కియ్య డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ జంగం సూరిబాబుకు ఇళ్ల పట్టాలు అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్కియ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న వారికి అక్కడే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం జిఒ జారీ చేసిందన్నారు. ఈ జిఒను పరిగణలోకి తీసుకుని నివసిస్తున్న చోటే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వేరే గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, ఆ స్థలాలు రద్దు చేసి ఇదే గ్రామంలో ఇవ్వాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు మంగిశెట్టి ఏసు, జంగం మనోహర్, సుబ్బారావు, లబ్ధిదారులు కంటిపలస బుచ్చమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అమ్మకానికి వైద్య విద్య..!

- పిపిపి విధానంలో పాలకొల్లు మెడికల్ కాలేజీ నిర్మాణం
- ప్రభుత్వ సొమ్ముతో కట్టి ప్రయివేటుకు ధారాదత్తం
- 50 శాతానికిపైగా వైద్య సీట్లు సొమ్ము పెట్టి కొనాల్సిందే
- రూ.లక్షలు వెచ్చించలేక వైద్య విద్యకు దూరం కానున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు
- ఇప్పటికే ఏలూరు మెడికల్ కాలేజీలో సీట్లు అమ్మకం
- ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైద్య విద్యను సామాన్యులకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. గతంలో వైసిపి కంటే దారుణంగా వైద్యవిద్యను పూర్తిగా అమ్మకానికి పెట్టేసింది. పిపిపి (పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ సొమ్ముతో మెడికల్ కాలేజీలు నిర్మించి ప్రయివేటుకు దానం చేసేందుకు సిద్ధమైంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మించే మెడికల్ కాలేజీని పిపిపి విధానంలో నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోద ముద్ర సైతం వేసింది. పిపిపి విధానంలో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపడితే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నామమాత్రపు ఫీజుకు పొందాల్సిన సీట్లకు సైతం రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. దీంతో సామాన్య ప్రజానీకం పిల్లలు వైద్యవిద్యకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీలో 42 శాతం సీట్లకు ఫీజులు నిర్ణయించడంతో విద్యార్థులు ఏవిధంగా నష్టపోయారో అందరికీ తెలిసిందే. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే ఏలూరులో నిర్మించిన మెడికల్ కాలేజీ. ఏలూరు మెడికల్ కాలేజీలో 2023లో ప్రారంభమైంది. ఈ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కాలేజీలో మెడికల్ సీట్లు అన్నీ కన్వీనర్ కోటాలోనే నీట్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. అలాకాకుండా 150 సీట్లలో రాష్ట్ర, ఆలిండియా కోటా కింద 86 సీట్లు కేటాయించి మిగిలిన 64 సీట్లకు ఫీజులు నిర్ణయించారు. బి కేటగిరిలోని 45 సీట్లకు రూ.12 లక్షలు ఫీజు నిర్ణయించగా, సి కేటగిరిలోని 19 సీట్లు ఎన్ఆర్ఐ కోటా కింద రూ.20 లక్షలు ఫీజు నిర్ణయించారు. నిబంధనల ప్రకారం బి కేటగిరిలోని 45 సీట్లు నామమాత్రపు ఫీజుకు కేటాయించాల్సి ఉంటుంది. రూ.12 లక్షలు ఫీజు నిర్ణయించడంతో తక్కువగా లెక్కించినా ఐదేళ్లలో ఫీజు, ఇతర ఖర్చులు కలుపుకుని రూ.75 లక్షలకుపైగా అవుతోంది. సామాన్య ప్రజానీకం తమ పిల్లలను అంత సొమ్ము చెల్లించి ఏవిధంగా చదివించాలో తెలియని పరిస్థితి నెలకొంది.

మార్పు చేస్తామని చెప్పి అంతకంటే దారుణంగా

అప్పట్లో వైసిపి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లకు ఫీజులు నిర్ణయించడాన్ని టిడిపి అగ్రనాయకులు చంద్రబాబు, లోకేష్ సైతం తప్పుబట్టారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే ఆ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పారు. ఇప్పుడు పిపిపి విధానంలో మెడికల్ కాలేజీ నిర్మించేందుకు పూనుకున్నారు. అంటే స్థలంతోపాటు అన్నీ ప్రభుత్వమే ఇచ్చి ప్రయివేటుకు అప్పగిస్తుందన్నమాట. ఈ విధంగా పూర్తి చేసిన కాలేజీలో 50 శాతానికిపైగా సీట్లకు రూ.లక్షల్లో ఫీజులు నిర్ణయిస్తారు. వైసిపి కంటే దారుణంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఐదేళ్లలో దాదాపు రూ.కోటి ఖర్చు చేసి సాధారణ ప్రజానీకం పిల్లలు వైద్యవిద్య ఏవిధంగా చదువుతారో ప్రభుత్వం చెపాల్సి ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటులో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..?

ఏలూరు మెడికల్ కాలేజీ తాత్కాలికంగా డిఎంహెచ్ఒ కార్యాలయ ఆవరణలో నిర్మించిన భవనంలో సాగుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రి ఆవరణలో రూ.535 కోట్లతో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టారు. గడిచిన మూడేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ పూర్తికాలేదు. ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులకు సర్వజన ఆసుపత్రి ఆవరణలోనే హాస్టల్ సదుపాయం కల్పించారు. ప్రతిరోజూ ఇక్కడ నుంచి మెడికల్ కాలేజీకి బస్సుల్లో వెళ్లాల్సి వస్తోంది. అందుకు ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇప్పుడు రూ.1500కు పెంచడంతో విద్యార్థులు నిలదీస్తున్న పరిస్థితి ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

కర్నూలు ఉల్లినే వినియోగించాలి

రైతులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ నాగరాణి



ఉల్లిపాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సోలాపూర్ ఉల్లి కంటే కర్నూలు ఉల్లి ఎంతో రుచికరమని,జిల్లా ప్రజలు, విద్యా సంస్థలు కర్నూలు ఉల్లినే వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. గురువారం తాడేపల్లిగూడెం ఉల్లి హోల్ సేల్ మార్కెట్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఉల్లి కొనుగోళ్లను పరిశీలించి ట్రేడర్స్, రైతులతో మాట్లాడారు. ఎక్కడ నుంచి ఉల్లి లోడ్‌లు వచ్చాయి, ఎన్ని మెట్రిక్ టన్నులు వచ్చాయి, ధర ఎంత పలుకుతోంది తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకుని పరిశీలించారు. కడప నుంచి వచ్చిన రైతు వద్ద 6 రూపాయల చొప్పున కొనుగోలు చేసినట్లు తెలుసుకొని రూ.9 చొప్పున ధర చెల్లించాలని ట్రేడర్‌కు చెప్పడంతో వారు అంగీకరించి తొమ్మిది రూపాయలు చొప్పున చెల్లించారు. దీంతో రైతు సంతోషం వ్యక్తం చేసి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సూచనలతో అన్ని రకాల కూరలూ ఉల్లిపాయలతో తయారు చేయించి ఉల్లి మార్కెట్ యార్డ్ వద్ద రైతులకు, ట్రేడర్స్‌కు ఏర్పాటు చేసిన భోజనాల్లో కలెక్టర్ పాల్గొని రైతులతో కలిసి ఉల్లి వంటకాలను స్వయంగా రుచిచూశారు. కర్నూలు ఉల్లి వంటకాలు అద్భుతంగా ఉన్నాయని, సోలాపూర్ ఉల్లి కంటే కర్నూలు రుచిగా ఉంటాయన్నారు. తమ ఇంట్లో కూడా కర్నూలు ఉల్లినే వినియోగిస్తున్నట్లు తెలిపారు. రిలయన్స్, డీమార్ట్, విజేత వంటి మెగా మార్టుల్లో కర్నూలు ఉల్లి అమ్మకాలకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు ఉల్లి అమ్మకాలపై సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, జిల్లా మార్కెట్ యార్డు ఎడి ఎం.సునీల్ కుమార్, తహశీల్దార్ కె.సునీల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, రైతులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు కోరుతూ ఆందోళనలు



పాలకొల్లులో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన దృశ్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రాంత ఉపాధ్యాయులు స్థానిక తహశీల్దార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులు, గ్రూప్-2ఉద్యోగులు, పోలీసులు అందరూ నిబంధనల ప్రకారం పాత పెన్షన్ విధానంలో ఉండాలని, అయితే పరిపాలన, రాజకీయ కారణాలతో నూతన పెన్షన్ విధానంలో ఉండిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం తమకు ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌సి 2003 ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ సబ్బే రామకృష్ణ, ఉపాధ్యాయ నేతలు పోలిశెట్టి క్రాంతికుమార్, గుత్తిందివి శ్రీనివాసరావు, జి.వీరన్నబాబు, ఎం.అరుణ్‌కుమార్, జె.ఉమామహేశ్వరరావు, ఎ.దుర్గారావు, పుల్లేటికుర్తి శ్రీనివాస్, పి.బాలరాజు, ఎంపీ రావు, ఎంఎన్‌వి.శ్రీదేవి, టి.నిరుపమ, పి.శ్రీలక్ష్మి, బిహెచ్.గీతాశేషవేణి, బి.హనుమంతరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులు, కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అనుసరించి గ్రూప్ 1, 2 ఉద్యోగులు పాత పెన్షన్ విధానం అమలు కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మహా నిరసన చేపట్టారు. తక్షణం ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు గాదిరాజు రామకృష్ణంరాజు , బిఆర్ఎంకె.స్వామి, బి.నాగ మురళీ, జి బేబీప్రశాంతి, ఎం.ఉమామహేశ్వరి, ఎల్.అప్పలాచార్యులు, సిహెచ్.చిరంజీవి, బుర్ర శ్రీనివాస్, టి.నాగేశ్వరరావు, జి.శ్రీనివాస్, బ్రహ్మాజీ, చంద్రశేఖర్, ఒ.శ్రీనివాస్, రాజా రమేష్ పాల్గొన్నారు.



భీమవరం : తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజా సమస్యలపై ఏచూరి అలుపెరగని పోరాటం



తణుకు : ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తణుకు

పదవులు, అధికారం కోసం పాకులాడకుండా కులం, మతం, దోపిడీ లేని సమ సమాజం కోసం కృషి చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం మాజీ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రతాప్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఈ దేశంలో ఉన్నా ప్రజల పట్ల అపారమైన ప్రేమ కలిగి ఉండేవారని తెలిపారు. ఆయన అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీలకు సైతం అనేక సూచనలు, సలహాలు అందించేవారన్నారు. మార్క్స్ సిద్ధాంతంపై అపారమైన పట్టు కలిగిన వ్యక్తి ఏచూరి అన్నారు. నేడు ఏచూరి భౌతికంగా లేకపోయినా అయన చూపిన పోరాట మార్గంలో సిపిఎం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, గుబ్బల గోపి, అంబటి రామకృష్ణ, బ్రహ్మాజీ, ఉషా, ఎం.గంగాధర్ రెడ్డి, మూర్తి, శారద, పిడి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు సీతారాం ఏచూరి అని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొనియాడారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని తణుకు బార్ అసోసియేషన్ హాల్లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అడ్డాల శివశంకర్ బాబ్జి మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి తన ప్రాణాలు పోయే వరకూ ప్రజా సమస్యలపై పని చేసిన కమ్యూనిస్టు నాయకుడని అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మునిస్వామి మాట్లాడారు. నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసిన నాయకుడు ఏచూరి అన్నారు. జి.అంబేద్కర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోడే గోపీకృష్ణ, ఎం.కుటుంబరావు, చింతపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: రాజ్యాంగ విలువలు, మత సామరస్యం, లౌకికవాద పరిరక్షణ కోసం తుదిశ్వాస విడిచే వరకూ ప్రజల పక్షాన పోరాడిన విప్లవ యోధుడు సీతారాం ఏచూరి అని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహనరావు అన్నారు. సిపిఎం మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సంత మార్కెట్ వద్ద గల అమరవీరుల భవనం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు పార్టీ మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.శర్మ అధ్యక్షత వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాద పరిరక్షణకు దేశంలో ప్రజలందరినీ ఐక్యం చేసి మతోన్మాద రాజకీయ శక్తులను దేశం నుంచి తరిమికొట్టడమే సీతారాం ఏచూరికి మనమిచ్చే నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తలుపురి బుల్లబ్బాయి, కుసమే జయరాజు, సిర్రా నరసింహమూర్తి, సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి, దేవదానం, సురేష్ పాల్గొన్నారు.

పోడూరు : సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు అన్నారు. పోడూరు సొసైటీ సెంటర్లో గురువారం సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్‌ఎస్) వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ చిత్రపటాలకు మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్లమెంట్ దృష్టికి ఎన్నో సమస్యలను తీసుకెళ్లడంతో పాటు వాటిపై ప్రశ్నలు సంధించిన సభ్యునిగా రాజ్యసభలో ఏచూరి గుర్తింపు పొందారన్నారు. జిల్లాలో రైతాంగ, కార్మిక, సహకార రంగాల్లో ఉన్న వారి కోసం ఆర్‌ఎస్ ఎంతో కృషి చేశారని అన్నారు. కమ్యూనిస్టు నేతగా ఆర్‌ఎస్ చేసిన పోరాటాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లి ప్రసాద్, మోడీ మోజేష్, బూరాబత్తుల వెంకట్రావు, కనకం పాల్గొన్నారు.

పెనుగొండ: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా మాట్లాడుతూ ఏచూరి దేశంలో మతోన్మాద శక్తులను ఎండగట్టడంలో, ఎన్నికల్లో ఇండియా బ్లాక్ ఏర్పాటుకు విశేష కృషి చేశారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పులిదిండి రామారావు, నాగిశెట్టి గంగారావు, జి.వరహారెడ్డి, శీలం యేసు పాల్గొన్నారు.

వాలంటీర్ విధులు నిలపాలని వినతి



గణపవరం : వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు


ప్రజాశక్తి - గణపవరం

సచివాలయ ఉద్యోగులకు ఆత్మ గౌరవ సమస్యగా ఉన్న వాలంటీర్ పనులు నిలపాలని కోరుతూ గురువారం మండల సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మికి, తహశీల్దార్ వై.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 5వ తేదీన విడుదల చేసిన ఆదేశాలకు సంబంధించి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వాలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన వివిధ విధులను సచివాలయ ఉద్యోగులు బాధ్యతలతోపాటు అదనపు బాధ్యతగా క్లస్టర్ మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికీ తిరిగే విధులు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అదనపు పనులు నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆచంట : ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో స్వామిత్వ, కౌశలం తదితర సర్వేల్లో సచివాలయ సిబ్బంది సహకారం ఎంతో అవసరమని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అంకితభావంతో పని చేస్తేనే ఆ మండలంలో పురోగతి ఉంటుందని, వారి సేవలను అధికారులు, ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహేతుకమైన వాటిపై పైఅధికారుల దృష్టికి పరిష్కారం నిమిత్తం సమర్పిస్తామని సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.బులి సూరన్న, పరి పాలనాధికారి బాబ్జీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకుంటాం

ఆక్వా ఎక్స్‌పోను ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు



పెదఅమిరంలో ఆక్వా ఎక్స్‌పోను ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సహకారం అందిస్తున్నాయని, ఆక్వా ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను రొయ్య, చేపల రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆక్వా ఎక్స్‌పోను మూడు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ అంజిబాబు అన్నారు. పెదఅమిరంలో మూడు రోజులపాటు జరిగే ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను ఎంఎల్‌ఎ రామాంజనేయులు గురువారం ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. అమెరికా విధించిన సుంకం రైతులపై పెనుభారంగా మారిందని, ఇకపై అమెరికా దిగుమతి దారులు 20 శాతం సుంకం భరించే విధంగా ఉందన్నారు. మిగిలిన సుంకం కూడా రాబోయే రోజుల్లో వారే భరించాల్సిందిగా ఉందని గమనిస్తున్నారన్నారు. తొమ్మిదేళ్లుగా ఇటువంటి ఆక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వంద స్టాళ్లకు పైగా ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ అంజిబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా ఎక్స్ ఇండియా సిఇఒ దంతులూరి వేణు, సంస్థ ఫౌండర్ సమీర్ పాత్ర, తరుణ్ శ్రీధర్, సికె.మూర్తి, జోడల్ ఇస్మాయిల్, వాసుదేవ దత్తు, ఇంట్రాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజరు రాయప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.


22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఏటా ఇచ్చే విధంగానే ఈ నెల 22వ తేదీ నుంచి ఈ ఏడాది కూడా దసరా సెలవులు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24వ తేదీ నుంచి సెలవులు ఇస్తున్నట్లు ఉందని, ఇది సరైన కాదని పేర్కొన్నారు. ఎప్పటిలాగానే ఈ నెల 22 నుంచి సెలవులు ఇవ్వాలని కోరారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి



మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయించు కోవాల్సిన బాధ్యత ఉపాధి కూలీలదేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు పిలుపునిచ్చారు. వ్యకాస మండల రెండో మహాసభ లక్ష్మణేశ్వరంలో జరిగింది. మహాసభకు అధ్యక్ష వర్గంగా తిరుమాని సత్యనారాయణ, గుత్తుల లక్ష్మి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచక సంఘం పతాకాన్ని దొంగ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ మహాసభలో సత్యనారాయణ, పెద్దిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఎటువంటి వ్యవసాయ పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో ఉపాధి పనులు చూపించడం సరైనదన్నారు. పనిచేసి వంద రోజులైనా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. పని దినాలు 200 రోజులకు పెంచాలని, వేతనం రూ.600 ఇవ్వాలని పని కావాలని దరఖాస్తు చేసిన ప్రతివారికి పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జల్లి రామ్మోహన్‌రావు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.త్రిమూర్తులు, మహిళా సంఘం నాయకులు కవురు లక్ష్మి, కౌలు రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పి.కామేశ్వరరావు, కవురు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం నూతన మండల అధ్యక్ష కార్యదర్శులుగా పోతాబత్తుల మణికుమారి, గుబ్బల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గుత్తుల లక్ష్మి, పిట్టా రాంబాబు, సహాయ కార్యదర్శిగా కట్టా మహాలక్ష్మి, మరో 11 మందితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకురాలు కళ్యాణి

ప్రజాశక్తి - కాళ్ల

కార్మికులు సంఘటితంగా పోరాడి హక్కుల్ని సాధించుకోవాలి తప్ప ఏ ప్రభుత్వాలూ దయతో కార్మిక హక్కులు ఇవ్వవని సిఐటియు జిల్లా నాయకురాలు దూసి కళ్యాణి అన్నారు. కాళ్ల శివాలయంలో సిఐటియు మండల మహాసభ గొర్ల రామకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు అనేక పోరాటాలు కార్మిక పక్షాన చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వాటిని రద్దు చేయాలని జరిగిన సమయాల్లో కోట్ల మంది కార్మిక వర్గంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ మెడను వంచారన్నారు. మహాసభ ముగింపులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఏడుకొండలు, కో కన్వీనర్లుగా దావులూరి మార్తమ్మ, పైడితల్లి, 14 మందితో సభ్యుల కమిటీని ఎన్నుకున్నారు. మల్లిపూడి ఆంజనేయులు, మండా సూరిబాబు పాల్గొన్నారు.

15 నెలలైనా హామీల అమలు శూన్యం

ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 15 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం విమర్శించారు. ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వారం రోజుల నుంచి ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా గురువారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమం చేస్తున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ఐగా సురేఖ మంగప్రియ బాధ్యతలు



నరసాపురం: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా బి.సురేఖ మంగప్రియ గురువారం బాధ్యతలు చేపట్టారు. నరసాపురం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగోన్నతి పై ఆమె రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి ఆర్ఐగా మిరియాలు లక్ష్మి నారాయణ బాధ్యతలు నిర్వహించారు. ఆర్ఐగా బాధ్యతలు చేపట్టిన సురేఖ తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణను కలిశారు. సురేఖకు విఆర్ఒలు, విఆర్ఎలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెంప రహదారి పనులు పూర్తి చేయాలి

మూడో రోజు కొనసాగిన రిలే దీక్ష

మొగల్తూరు : మొగల్తూరు నుండి వెంప రహదారి అభివృద్ధి పనులు చేపట్టి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడం దారుణమని ఐక్యవేదిక కన్వీనర్ ఎడ్ల చిట్టిబాబు అన్నారు. మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడవరోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడారు. ఆరు సంవత్సరాల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు నేటికీ పూర్తి కాకపోవడం దారుణం అన్నారు. రహదారి పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, ఆదురి సాంబమూర్తి, కొల్లాటి బాబురావు పాల్గొన్నారు.

14న ఉచిత మెగా వైద్య శిబిరం

పోస్టర్‌ను ఆవిష్కరించిన తహశీల్దార్ రావి రాంబాబు

భీమవరం టౌన్ : ఈనెల 14వ తేదీన భీమవరంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రావి రాంబాబు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్నిరకాల వైద్య పరీక్షలను 10 మంది వైద్యులచే ఉచితంగా చికిత్సలు అందించడం గొప్ప విశేషమని అన్నారు. వండర్ కిడ్స్ స్కూల్ ఛైర్మన్ అల్లు రామకృష్ణ, వినాయక హాస్పిటల్ డాక్టర్ సివిఆర్ గజపతిరాజు మాట్లాడుతూ ఈనెల 14న మెంటెవారి తోటలోని వండర్ కిడ్స్ స్కూల్ వద్ద ఉదయం 9 గంటల నుంచి వినాయక హాస్పిటల్, వండర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, అన్ని వయసుల వారికి అన్ని వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నాగార్జున, రెవెన్యూ అధికారులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దూర విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు 15 వరకూ గడువు

మొగల్తూరు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(దూర విద్యా విధానం) ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలకు అపరాధ రుసుము రూ.200తో ఈనెల 15 వరకు గడువు ఉందని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వర్తమానం రవిశంకర్ సర్కార్ తెలిపారు. ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ ఆధ్వర్యాన గ్రామంలో అవగాహన ప్రదర్శన గురువారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.అయ్యప్ప నాయుడు, రంగరాజు, హైనా రత్నం, విజయ్ కుమార్, వర్మ, ఆనంద్, యోసేబ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉండి : విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి వారిలో పోటీ తత్వాన్ని నింపడం ద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి అన్నారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కోట శ్రీనివాస్, కోట శ్రీకాంత్ తమ తల్లి కోట సీతాదేవి జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సంవత్సరం ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు కూడా నగదు పురస్కారం అందించారని, వారు చదివిన పాఠశాల మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం అందించి వారిని ప్రోత్సహిస్తున్న కోట శ్రీకాంత్, శ్రీనివాస్‌లకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

88 మందికి సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఆచంట : ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేదలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 88 మంది బాధితులకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ రూ.48 లక్షల 11 వేల 983 నగదు విలువ గల చెక్కులను కొమ్ముచిక్కాల ఆఫీసు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

భీమవరం టౌన్ : ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హేకథాన్ 2025 సెమీఫైనల్స్‌లో విన్నర్స్‌కు, రన్నర్స్‌కు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. విన్నర్స్‌గా భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీవిష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరం, విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్, రాజమండ్రి, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రాజమండ్రి, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సూరంపాలెం, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజ్ సూరంపాలెం, ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్ రాజమండ్రి, ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ కాకినాడ వారికి ఒక్కొక్క టీంకి రూ.10 వేల చెక్కును కలెక్టర్ చేతుల మీదగా అందించారు. రన్నర్స్‌గా ఆదిత్య డిగ్రీ కాలేజ్ తుని, బివిసి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ రాజమండ్రి, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ భీమవరం, గైట్ ఇంజినీరింగ్ కాలేజ్ సూరంపాలెం, గైట్ ఇంజినీరింగ్ కాలేజ్ రాజమండ్రి, శ్రీవిష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ భీమవరం, ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ సూరంపాలెంకి ఒక్కొక్క టీంకు రూ.5 వేలు చొప్పున చెక్కును కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అందించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు : ఆరిమిల్లి

తణుకు : నియోజకవర్గంలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులతో ఇరగవరం మండలం అనుమానమిల్లం నుంచి పెదిరెడ్డి పాలెం మీదుగా కంతేరు వరకు రూ.45 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇరగవరం మండలం రేలంగి శివారు మద్యపాడరేతిప్ప గ్రామం వరకు రూ.30 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. తణుకు మండలం మండపాక శివారు యర్రకొల్లగుంట నుంచి అత్తిలి మండలం వరిఘేడు వరకు రూ.65 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత సమయంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఛాంబర్స్ కళాశాలకు ఐఎస్ఒ గుర్తింపు

పాలకొల్లు : స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలకు అంతర్జాతీయ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఒ) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ తమ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో కల్పిస్తున్న సకల సదుపాయాలను గుర్తించారని, ఈ ఐఎస్ఓ సర్టిఫికెట్ అని, ఇది సాధించడం ఆనందంగా ఉందని, డైరెక్టర్లు సిబ్బందిని అభినందించారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ అర్ప్రదీప్ భాను, కళాశాల అకాడమిక్ అడ్వైజర్ విబిఎస్ మూర్తి, ఎన్.సీతారామరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 11 మంది ఎంపిక

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో ఈనెల 11న నిర్వహించిన ఉద్యోగ మేళాలో కాలేజీ చెందిన 11 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి గురువారం తెలిపారు. అపోలో ఫార్మసిక్ ముగ్గురు, పేటీఎంకి ముగ్గురు, బిటిఎస్ గ్రూప్‌కి ఐదుగురు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులను సిహెచ్.అనూరాధ, ఎన్.బి.గణేష్ కుమార్, ప్రసాద్ అభినందించారు.

నాలుగు దుకాణాల్లో చోరీ

నిందితుల కోసం గాలింపు

నరసాపురం : పట్టణంలోని పాత బజార్ సమీపంలోని నాలుగు ఎలక్ట్రికల్ సామాను దుకాణాల్లో చోరీ జరిగింది. గురువారం ఉదయాన్నే యజమానులు షాపు తీసి చూడగా షాపు తాళాలు పగలగొట్టి, చెల్లా చెదురుగా పడి ఉండడాన్ని గమనించారు. నాలుగు షాపుల్లోని సీసీ పుటేజ్‌ను సంబంధించిన హార్డ్ డిస్క్‌లను దొంగిలించారు. దీంతో షాపు యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సిఐ బి.యాదగిరి, ఎస్ఐ జయలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించి ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు పడ్డారు.

చించినాడ బ్రిడ్జికి మరమ్మతులు..

ఎప్పటికి పూర్తయ్యేనో..
పనుల పూర్తిపై స్పష్టత ఇవ్వని అధికారులు
విద్యార్థులకు తప్పని తిప్పలు



చించినాడ బ్రిడ్జి దగ్గరలో నిలిపి ఉంచిన బస్సులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ వశిష్ఠ గోదావరి బ్రిడ్జికి గతనెల రోజులకుపైగా హైవే అథారిటీ సంస్థ చేపట్టిన మరమ్మత్తుల నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో పలు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. పనులు ప్రారంభించిన నాటి నుండి అన్ని రకాల బస్సులు, లారీలతో పాటు హెవీ వెహికల్స్ వెళ్లకుండా పూర్తిగా నిషేధించిన అధికారులు తాము చేపట్టిన పనుల అనుకూలతను బట్టి కొన్ని సమయాలను ముందుగా ప్రకటించి కేవలం చిన్న కార్‌లు, మోటార్ సైకిల్స్, చిన్న మినీ వ్యాన్ల ప్రయాణాలకు మాత్రమే అనుమతిస్తూ.. కొన్ని సందర్భంలో వీటికి కూడా అనుమతులు నిలుపుదల చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుండి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు తదితర పట్టణాలలో వివిధ ప్రయివేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రయాణించే యాజమాన్యాలకు చెందిన ప్రయివేటు బస్సులతో పాటు ఆర్‌టిసి బస్సులను బ్రిడ్జికి అవతలి వైపు తూర్పుగోదావరి జిల్లా దిండి గ్రామంలో నిలుపుదలు చేస్తుండడంతో అక్కడి నుండి బస్సు దిగి సుమారు కిలోమీటర్‌పైన బ్రిడ్జిపై కాలి నడకన ఇటు వైపు వచ్చి ఆయా కళాశాలలకు చెందిన బస్సుల్లో ప్రయాణించేందుకు ఉదయం, సాయంత్రం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఈ బ్రిడ్జి మరమ్మతుల పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో.. అయోమయ పరిస్థితులలో విద్యార్థులతో పాటు రెండు జిల్లాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



తూర్పుగోదావరి జిల్లా దిండి నుండి చించినాడ వైపు బ్రిడ్జిపై నడిచి వస్తున్న విద్యార్థులు

జిల్లా 69వ స్కూల్ గేమ్స్‌కు జట్ల ఎంపిక

భీమవరం : భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ అండర్-19 బాల బాలికల నెట్ బాల్, మాల్కంబ్ క్రీడల్లో ఎంపికలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమాన్ని బ్రౌనింగ్ జూనియర్ కళాశాల సెక్రటరీ మేడిది ఎస్తేరు ప్రియాంక ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.జయరాజు మాట్లాడుతూ 100 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఈ క్రీడా పోటీల్లో ఎంపికైన వారు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ నాగమణి, బ్రౌనింగ్ కళాశాల పిడి దావుద్ ఖాన్, పిడిలు శ్రీనివాస్, జిపిసి శేఖర్‌రాజు, పిడి పీటీలు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని బ్రౌనింగ్ విద్యాసంస్థల ఛైర్మన్ మేడిది జాన్సన్, సెక్రటరీ మేడిది ఎస్తేరు ప్రియాంక, వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, పీడీలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయిని శోభారాణికి సత్కారం

పెనుమంట్ర : అన్ని వృత్తుల్లో ఉత్తమమైన వృత్తి అయిన ఉపాధ్యాయ వృత్తిలో అవార్డు పొందడం టీచర్స్‌కు వరం అని పలువురు వక్తలు అన్నారు. గురువారం మండలంలోని ఆలమూరు మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయిని యాళ్ల శోభారాణికి జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా గ్రామం, పాఠశాల, ఎస్ఎంసి తరుపున ఘనంగా శోభారాణి దంపతులకి అభినందన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి అయ్యప్పరెడ్డి, తేతలి రామా రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులు, జాతీయ అవార్డు గ్రహీత కెఎన్‌వి.శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు కడలి సత్యనారాయణ, భువనేశ్వరి, స్థానిక ఉపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ రాజు, చింతపల్లి నాగ ప్రియ, ప్రసంగించారు. సభను విశ్రాంత హెచ్ఎం, జర్నలిస్ట్ ఎస్‌కె.నాగేశ్వరరావు నడిపించారు. పాఠశాల ప్రాంతంలోని ప్రజలు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి, పిఎంసి సభ్యులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న చైతన్యరాజు

16న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

పాలకొల్లు : ఈనెల 16వ తేదీన పాలకొల్లు-భీమవరం పిపి రోడ్ లో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి ఛైర్మన్ చైతన్య రాజు, ఎమ్‌డి, మాజీ ఎంఎల్‌సి కె.రవివర్మ తెలిపారు. బుధవారం వారు ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అమలాపురం కేంద్రంగా ప్రధాన ఆసుపత్రి ఉందని ఇంకా కోనసీమ జిల్లాలో 20 చోట్ల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. ప.గో జిల్లా కూడా తన భార్య, కోడలు సొంత గ్రామాలు కావడంతో పాలకొల్లులో 100 బెడ్ ఆధునిక సౌకర్యాలతో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, డయాలిసిస్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి ప్రత్యేక స్పెషలిస్ట్‌లతో పనిచేస్తుందని చెప్పారు. ఈ ప్రాంతంలో అత్యవసర గుండె చికిత్స కోసం ఇంతవరకు విజయవాడ, రాజమండ్రి, అమలాపురం వెళుతున్నారని, ఇక పాలకొల్లులోనే ఆ సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఛాంబర్ కళాశాల కార్యదర్శి కెవి.సీతారామరాజు పాల్గొన్నారు.

భారత జట్టు సభ్యులను కలసిన మేనేజర్ ప్రశాంత్

భీమవరం టౌన్ : దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్ లో భారత జట్టు మేనేజర్ పులపర్తి ప్రశాంత్(ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు తనయుడు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్) జట్టు సభ్యులతో ముచ్చడించారు. గురువారం కోచ్ గౌతమ్ గంభీర్‌తో మేనేజర్ ప్రశాంత్ చర్చించారు. మొదటి మ్యాచ్‌లో యుఎఇ భారత్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆదివారం (ఈనెల 14న) పాకిస్తాన్‌తో భారత్ జట్టు తలపడనుంది.

విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలి

గైనకాలజిస్ట్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి

తణుకు : విద్యార్థినులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, జాతీయ సేవాపథకం వారి సంయుక్త ఆధ్వర్యంలో స్త్రీల సమస్యలు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశం పై కళాశాల ప్రిన్సిపల్ యుఎల్.సుందరీబాయ్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ రుతుక్రమ సమస్యలు, హార్మోన్స్ ప్రభావం వల్ల అనేక సమస్యలు ఎదురౌతున్నాయని అవగాహన కల్పించారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.తులసీరత్నం, సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.

వర్మి కంపోస్టు తయారీపై దృష్టి పెట్టాలి

ఎంపిడిఒ వి.రెడ్డియ్య



డ్వాక్రా మహిళకు పుస్తకాలను అందజేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

గుర్రపు డెక్క నుంచి వర్మి కంపోస్టును తయారు చేసే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని పాలకోడేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.రెడ్డియ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా ఎపిఎం, సిసి, సిఎ, ఎనర్జీస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రెడ్డియ్య మాట్లాడుతూ గుర్రపు డెక్క నుండి వర్మి కంపోస్ట్ రూపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వర్మీ కంపోస్ట్ సాగు పొలాలకు, ఉద్యానవన క్షేత్రాలకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. వర్మీ కంపోస్ట్ తయారీ వల్ల యూరియా వినియోగం కూడా తగ్గుతుందన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జిలకు ఉపాధి అవకాశం ఏర్పాటుకు ఇది ఒక చక్కని అవకాశం అన్నారు. పెద్ద ఎత్తున గుర్రపు డెక్కను సేకరించి వర్మీ కంపోస్ట్ కేంద్రాలకు తరలించి ఆదాయ వనరులు సృష్టించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్ఆర్‌జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్, ఎపిఎం భారతి, డ్వాక్రా సిసిలు, సిఎలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చదువుకు వయసుతో సంబంధం లేదు : ఎపిఎం

చదువుకునేందుకు వయసుతో సంబంధం లేదని ఎపిఎం భారతి, ఎన్ఆర్‌జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అక్షర ఆంధ్ర పుస్తకాన్ని ఎంపిడిఒ వి.రెడ్డియ్య, డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్ ఆవిష్కరించి డ్వాక్రా మహిళలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిఎం భారతి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువు చెప్పాలని ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీనికి వయసుతో సంబంధం లేదని, ఎంతటి వయస్సున్న వారైనా చదువుకోవచ్చునని తెలిపారు. డ్వాక్రా సిసిలు, సిఎలు గ్రామస్థాయిలో వివరాలు సేకరించి ప్రతి ఒక్కరికి చదువు చెప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బంగారు గోపి, శ్రీదేవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డిపిఒ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల అభివృద్ధికి పంచాయతీ అధికారులు కృషిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) రామ్‌నాథ్ రెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాలవానితిప్ప గ్రామాన్ని గురువారం పర్యటించారు. ఐవిఆర్ఎస్ గ్రామంగా ప్రకటించడంతో గ్రామంలో డోర్ టు డోర్ గ్రాఫ్ కలెక్షన్స్, చెత్త సేకరణపై అవగాహన కల్పించేందుకు మాలవానితిప్ప గ్రామపంచాయతీలో పర్యటించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు వేసి చెత్త సేకరణకు వచ్చే కార్మికులకు అందజేయాలన్నారు. గ్రామస్తులకు తడి, పొడి చెత్త గురించి, గ్రామాల్లో వీధులు, ఇళ్ల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. మురుగునీరు, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీని ప్రతి రోజు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికుల పని గురించి ప్రభుత్వం నుంచి వచ్చే కాల్స్‌కు వాస్తవాలు చెప్పాలని, నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మంచినీటి చెరువును, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి చెన్ను సుజాత, సుభాష్ చంద్ర బోస్ మాజీ సైనిక్ కాలనీ గ్రామ సర్పంచి మంతెన శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

హై స్కూల్‌లో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి
యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కాళ్ల

బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. గురువారం లక్ష్మీనరసింహపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగులో ఉన్న డిఎలు వెంటనే విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19 వరకు జరగబోవు రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మోసెస్, ఎవివి.సత్యనారాయణ, కె.కిషోర్, ఎన్.సీతాదేవి, సూర్యనారాయణరాజు, జిడబ్ల్యూపి.కుమార్, కె.రాంబాబు, కె.కృష్ణమూర్తి, ఎస్‌కె.ఫాతిమా పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి - నరసాపురం



విద్యార్థులను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈసదస్సులో ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 113 బృందాలతో 435 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా హ్యాకతాన్ బహుమతిగా రూ.75 వేలు, నాన్ టెక్నికల్ బహుమతిగా రూ.90 వేలు అందించారు. మూడు విభాగాల్లో 12 మంది అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతల్ని కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో సిఇఒ కొండవీటి బాలరాజు, ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి త్రినాద్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గోపిచంద్, ప్రసాద్, ఉమారుణాదేవి, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల ఎర మందు పంపిణీ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఎఒలు

ప్రజాశక్తి - ఉండి

రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు అందించే బ్రోమోడయోలిన్ మందులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. గురువారం ఉండి మండలం యండగండి, పెదపుల్లేరు, ఉండి, ఉప్పులూరు, చెరుకువాడ వాంద్రం, పాందువ్వ తదితర గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా పొలాలలో ఎలుకల కన్నాలను గుర్తించి వాటిని మట్టితో కప్పించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఈవిధంగా మూసి ఉంచిన కన్నాలు శుక్రవారం తెరుచుకున్నటువంటి కన్నాలను బతికి ఉన్న ఎలుక కన్నాలుగా గుర్తించి ఆ కన్నాల వద్ద ఎలకల నివారణ మందు ప్యాకెట్లను పెట్టించడం ద్వారా ఎలుకల ఉధృతిని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. బ్రోమో డయోలిన్ మందులో నూకలు, నూనెను కలిపి పొట్లాలుగా తయారు చేసి శుక్రవారం అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నిమ్మల శ్రీనివాస్ కోరారు.

పెనుమంట్ర : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, రైతు సేవా కేంద్రాల వద్ద ఈనెల 12 శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.దేవీ స్వరూప తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద, పంచాయతీల వద్ద బ్రోమోడయోలిన్ నూకలతో కూడిన ఎరమందును ఉచితంగా పంపిణీ చేయబడుతుందని, రైతులు, కౌలు రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

ఆచంట : మండలంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సజీవ ఎలుక కన్నాలను గుర్తించి మట్టితో పూడ్చి పెట్టే కార్యక్రమాన్ని గురువారం రైతులతో వ్యవసాయ అధికారి బి.నాగరాజు చేపట్టారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ, రైతు సేవా కేంద్రాల్లోనూ బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎరను రైతులందరికీ ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గణపవరం : మండలంలో శుక్రవారం ఎలుకల నిర్మూలనకు ఎలుకల మందును అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద నూకలు నూనేతో కలిపి రైతులకు అందజేస్తున్నట్లు గణపవరం ఎఒ ఆర్ఎస్.ప్రసాద్ చెప్పారు. మండలానికి 60 కేజీల బ్రోమోడియాలిన్ మందు కేటాయించినట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నరసాపురం: మండలంలో శుక్రవారం నిర్వహించే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఒ జ్యోషిలా తెలిపారు. గురువారం పలు గ్రామాల్లోని పొలాలను పరిశీలించారు. గుర్తించిన కన్నాల్లో మట్టితో పూడ్చాలన్నారు. శుక్రవారం తెరిచిన కన్నాల్లో వ్యవసాయశాఖ అందించిన ఉచిత ఎర మందును పెట్టాలన్నారు. దీనివల్ల సామూహికంగా ఎలుకల్ని నిర్మూలించవచ్చునన్నారు.

లంక గ్రామాల రైతులకు పశువుల దాణా పంపిణీ

ఆచంట : లంక గ్రామాలలో నెలకొన్న సమస్యలు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ తనయుడు పితాని వెంకట్ అన్నారు. వశిష్ఠ గోదావరికి ఇటీవల సంభవించిన వరదల వల్ల ఇబ్బందులకు గురైన అయోధ్య లంక, పెదమల్లం లంక, అనగారలంక గ్రామాలలో గురువారం పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పెదమల్లం అనగార్లంక, భీమలాపురం, కోడేరు, అయోధ్య లంక గ్రామాల రైతులకు 40 టన్నుల పశుగ్రాసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.